జిల్లా వ్యవసాయశాఖ అధికారిగా అన్నపూర్ణ

పార్వతీపురం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవసాయశాఖ అధికారిగా అన్నపూర్ణ నియామకమయ్యారు. కురుపాం వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆమెకు పదోన్నతి కల్పించారు. ఇక ఇప్పటివరకు జిల్లా వ్యవసాయాధికారిగా పనిచేసిన రాబర్ట్‌పాల్ బదిలీపై అనకాపల్లి వెళ్లిపోయారు. నూతనంగా నియామకమైన అన్నపూర్ణ బుధవారం విలేఖర్లతో మాట్లాడుతూ.. జిల్లా వ్యవసాయశాఖ ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో సేవలందిస్తామన్నారు. అందరి సహకారంతో ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరే విధంగా పనిచేస్తామని వెల్లడించారు.

- కొంతమంది ఉద్యోగుల్లో కొరవడిన సమయపాలన
- లేఖ ఇవ్వకుండానే విధులకు డుమ్మా
- సర్వేలంటూ ఇంకొందరు బయటకు..
- తిరిగి ఎప్పుడొస్తారో తెలియని వైనం
- వెలవెలబోతున్న కార్యాలయాలు
- సిబ్బందిలో కొందరు బిజీ.. మరికొందరు ఖాళీ
- స్పష్టంగా కనిపించిన పర్యవేక్షణ లోపం
- ప్రజలకు పూర్తిస్థాయిలో అందని సేవలు

సచివాలయాలకు.. ఎప్పుడొస్తారో?



సిబ్బంది , అర్జీదారులు లేక బోసిపోయిన మక్కువ సచివాలయం-2 హాలు

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

పార్వతీపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాటి ద్వారా ప్రజ లకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. అనేకచోట్ల సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. ఎప్పుడు విధులకు హాజరవుతున్నారో.. ఎప్పుడు బయటకు వెళ్తున్నారో తెలియని పరిస్థితి. కొన్ని సచివాలయాల్లో అరకొరగానే ఉద్యోగులు కనిపిస్తున్నారు. కొంతమంది సెలవు లేఖ ఇవ్వకుండా డుమ్మా కొడుతున్నారు. అనేక సచివాలయాల్లో ఒకరిద్దరు ఉద్యోగులే దర్శనమిస్తున్నారు. దీంతో వివిధ పనులపై వచ్చిన వారికి ఇబ్బందులు తప్పడం లేదు. మొత్తంగా జిల్లాలోని సచివాలయ వ్యవస్థపై పర్యవేక్షణ కొరవడింది. సోమవారం జిల్లాలోని పలు సచివాలయాలను 'ఆంధ్ర జ్యోతి' విజిట్ చేసింది. ఈ నేపథ్యంలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. కేవలం కొంతమంది ఉద్యోగులు మాత్రమే విధుల్లో బిజీగా ఉండగా, మరికొంతమంది ఖాళీగా ఉండడం కనిపించింది.



మక్కువ సచివాలయంలో-2లో ఉద్యోగి రాకకోసం ఎదురుచూస్తున్న వ్యక్తి



సాలూరు మండలం కరాసువలస సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఒకే ఒక్క ఉద్యోగి

పలుచోట్ల ఇలా ..

● పాలకొండ: స్థానిక ఇందిరానగర్‌కాలనీలోని సచివాలయాన్ని సోమవారం ఉదయం 10:30 గంటలకు పరిశీలించగా ఐదుగురు మాత్రమే కనిపించారు. ఇక్కడ పది మంది పనిచేయాల్సి ఉంది. అయితే వీఆర్వో , ప్లానింగ్ సెక్రటరీలు డెప్యుటేషన్‌పై వెళ్లారు. మిగతా ఎనిమిది మందిలో ఐదుగురు విధుల్లో ఉండగా.. ముగ్గురు ఏఎన్ఎంలు అర్బన్ సెంటర్లకు వెళ్లినట్లు అడ్మిన్ శ్రీనివాసరావు తెలిపారు.

● మక్కువ రూరల్: మక్కువలోని రెండు సచివాలయాలను సోమవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్యలో సందర్శించగా సిబ్బంది కనిపించలేదు. సచివాలయం-1లో మొత్తం 11మంది పనిచేయాల్సి ఉండగా మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎనిమిది మంది సిబ్బందిలో వీఆర్‌వో మాత్రమే సచివాలయంలో విధులు నిర్వహించారు. మిగిలిన ఏడుగురు ఉద్యోగులు ఎక్కడ విధులు నిర్వహిస్తున్నది తెలియరాలేదు. సచివాలయం-2లో వెల్ఫేర్ అసిస్టెంట్ మాత్రమే కనిపించారు. ఇక్కడ పది మంది ఉద్యోగులు పనిచేయాల్సి ఉండగా.. నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరో ఐదుగురు ఉగ్యోగులు ఎక్కడకెళ్లారో తెలియలేదు. మొత్తంగా రెండు సచివాలయాల్లో వీఆర్వో, వెల్ఫేర్ అసిస్టెంట్, వ్యవ సాయ శాఖ ఉద్యోగి మాత్రమే విధుల్లో కనిపించారు. మిగతా 11మంది ఉద్యోగులు సర్వేల కోసం బయటకు వెళ్లిపోయారని ఎంపీడీవో ఎస్.అర్జునరావు తెలిపారు. ● సాలూరు: మండలంలో కరాసువలస సచివాలయాన్ని

(మిగతా 8వ పేజీలో...)

గ్రేడ్‌లుగా విభజన

జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 312, పట్టణాల పరిధిలో 38 సచివాలయాలు ఉన్నాయి. 2,500 లోపు ప్రజలు ఉన్న సచివాయాలను ఏ గ్రేడ్‌గా, 2,501 నుంచి 3,500 జనాభా ఉన్న సచివాలయాలను బీ గ్రేడ్‌గా, 3,501 మించి జనాభా ఉన్న సచివాలయాలను సీ-గ్రేడ్‌గా విభజించారు. ఏ-బీ గ్రేడ్‌లో 137, సీ గ్రేడ్‌లో 70 సచివాలయాలు ఉన్నాయి.

గతంలో నియామకం ఇలా..

గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలోని సచివాలయాల్లో పది నుంచి 11 మంది ఉద్యోగులను నియమించింది. ఇందులో ఇద్దరు లేదా ముగ్గురికు మినహా మిగిలిన వారికి ఏ పనీ లేదు. గతంలో వలంటీర్ల అన్నీ తామై వ్యవహరించడంతో కొంతమంది ఉద్యోగులకు తమ విధులేమిటో తెలియని పరిస్థితి. ఇంకొంతమందికి అవసరమైన పని లేకుండా పోయింది.



పాలకొండ: ఇందిరానగర్ కాలనీలోని సచివాలయంలో పూర్తిస్థాయిలో హాజరు కాని సిబ్బంది

కూటమి చర్యలు ..

● సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పూరిస్థాయిలో సేవలు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రక్షాళనలో భాగంగా కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ మేరకు ఇటీవల రీ గ్రూపింగ్ చేపట్టిన తర్వాత కొన్ని సచివాయాలకు కొంత మంది సిబ్బంది అవసరం లేదని స్పష్టంగా ఆదేశాలు జారీ చేసింది.

● జిల్లాలోని 15 మండలాల్లో 312 గ్రామ సచివాలయాలున్నాయి. మొత్తంగా 4,056 పోస్టులు మంజూరు చేయగా.. ప్రస్తుతం 3,067 మంది పనిచేస్తున్నారు. ఇందులో 2,532 మంది ఉద్యోగులు అవసరం కాగా.. మరో 1,724 మంది అదనంగా ఉన్నారని గుర్తించారు.

● 62 సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు, మరో 79 సచివాలయాల్లో కార్యదర్శులు, 40 చోట్ల ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, మరో 218 సచివాలయాల్లో మహిళా పోలీసులు, 141 సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు , 157 సచివాలయాలల్లో వీఆర్‌వోలు, మరో 155 సచివాలయాల్లో గ్రామ సర్వేయర్లు అవసరం లేదని ప్రభుత్వం గుర్తించింది.

● 157 సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లు, 295 చోట్ల మత్స్య శాఖ అసిస్టెంట్లు, 266 సచివాలయాల్లో ఉద్యానశాఖ, 83 చోట్ల అగ్రికల్చర్ , మరో 71 సచివాలయాల్లో పరిధిలో వెటర్నరీ అసిస్టెంట్లు అవసరం లేదని గుర్తించారు.

● పట్టణాలకు సంబంధించి 21 సచివాలయాల పరిధిలో మహిళా పోలీసులు, 20 చోట్ల ఎనర్జీ అసిస్టెంట్లు, 16 సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అవసరం లేదని గుర్తించారు. వారితో పాటు మరికొంతమంది ఉద్యోగులను అవసరమైన చోటకు బదిలీ చేసేందుకు చర్యలు ప్రారంభించింది.

గృహ నిర్మాణాలకు ప్రాధాన్యం



సాలూరులో లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశం చేస్తున్న మంత్రి సంధ్యారాణి

● మంత్రి సంధ్యారాణి

సాలూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పేదల గృహ నిర్మాణాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. బుధవారం పట్టణంలోని 12వ వార్డులో గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి చేతుల మీదుగా గృహ ప్రవేశాలు, ఇళ్ల పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో 22 వేల 833 ఇళ్లు మంజూరు చేయగా.. ఇందులో 15 వేల 661 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. సాలూరు మున్సిపాలిటీలో 195 ఇళ్లకు ఆమోదం లభించిందన్నారు. పీఎం జన్‌మన్ పథకంలో పీవీటీజీల కోసం 5వేల 169 ఇళ్లు మంజూరు చేయగా 4 వేల 263 ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయని వెల్లడించారు. సాలూరు, పార్వతీపురం, పాలకొండలో కొత్తగా 634 ఇళ్లకు ఆమోదం లభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇంటి తాళం అందజేస్తున్న మంత్రి

ఎన్నాళ్లీ డోలీ మోత?

- గిరిజనులకు తప్పని ఇక్కట్లు
- ఆసుపత్రికి చేరినా దక్కని ఫలితం
- రెబ్బలో ఓ వృద్ధురాలి మృతి.. ఆలస్యంగా వెలుగులోకి..

కొమరాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు సదుపాయం లేక గిరిశిఖర గ్రామస్థులకు డోలీ మోతలు తప్పడం లేదు. అష్టకష్టాలు పడి ఆసుపత్రులకు చేరుతున్నా.. ఒక్కోసారి రోగుల ప్రాణాలు నిలవడం లేదు. తాజాగా కొమరాడ మండలంలో చోటుచేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. రెబ్బ కొండ శిఖర గ్రామానికి చెందిన తాడంగి నరసమ్మ (83) కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతోంది. సోమవారం వృద్ధురాలి పరిస్థితి బాగోలేక పోవడంతో కుటుంబ సభ్యులు డోలీ కట్టారు. సుమారు రెండు కిలోమీటర్లు రాళ్ల రప్పలు దాటి .. కొండ దిగి నాగావళి తీరానికి చేరుకున్నారు. డోలీ మోసుకుంటూనే నదిని దాటి ఒడిశా రాష్ట్రం వత్తాడ గ్రామానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ఆటో ద్వారా కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. అప్పటికే గిరిజన వృద్ధురాలికి బీపీ పెరగడంతో వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఆరోగ్యం మెరుగవకపోడంతో అక్కడి నుంచి విజయనగరం ఘోష ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం వృద్ధురాలు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా జ్వరం, బీపీ వల్లే నరసమ్మ చనిపోయినట్లు కూనేరు రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారి శామ్యూల్ జోహ తెలిపారు.



డోలీ మోసుకుంటూ నది దాటుతున్న దృశ్యం

రోడ్డు నిర్మించండి..

ఒడిశా సరిహద్దు.. మండల కేంద్రానికి 15 కిలోమీటర్ల

(మిగతా 8వ పేజీలో...)

ఆలయ అభివృద్ధికి కృషి చేయండి

● మంత్రి సంధ్యారాణి

గజరాజులతో భయం.. భయం

6లో

పథకాల అమలులో పురోగతి తప్పనిసరి

● కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పథకాల అమలులో కచ్చితమైన పురోగతి కనిపించాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. కేంద్ర సంక్షేమ పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూరే విధంగా ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణం, ఉపాధి హామీ, వైద్య, విద్య రంగాల్లో ప్రగతిని పరిశీలించి.. సకాలంలో లోపాలను సరి చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. డోలీ మోతలు లేకుండా చూడాలన్నారు. దశలవారీగా గృహ నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం పనికిరాదన్నారు.ఈ సమావేశంలో జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్ కలెక్టర్ వైశాలి, డీఆర్వో హేమలత ఇతర అధికారులు పాల్గొన్నారు.

కురుపాంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ విచారణ

కురుపాం,నవంబరు12(ఆంధ్రజ్యోతి): కురుపాం గురుకుల పాఠశాలలో బుధవారం జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) విచారణ చేపట్టింది. పచ్చ కామెర్లతో ఇద్దరు విద్యార్థినుల మరణించడంతో పాటు పలువురు బాలికలు జాండీస్ లక్షణాలతో ఆసుపత్రిలో చేరడానికి గల కారణాలపై ఆరా తీశారు. తొలుత కమిటీ సభ్యులు వసతి గృహాలు, భోజన శాల, తరగతి గదులు, ఆరోగ్య విభాగాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, సిబ్బందితో మాట్లాడారు. బాలికలు ఎలా అనారోగ్యానికి గురయ్యారన్న దానిపై వివరాలు సేకరించారు. అనంతరం మృతి చెందిన బాలికల స్వగ్రామాలు దండుసూర, గుమ్మ లక్ష్మీపురం మండలం కంబగూడకు కమిషన్ సభ్యులు చేరుకున్నారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పిల్లల్లో న్యూమోనియా గుర్తించండి: డీఎంహెచ్‌వో

బెలగాం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పిల్లల్లో న్యూమోనియా లక్షణాలు గుర్తించి సకాలంలో చికిత్స అందించాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు ఆదేశించారు. ప్రపంచ న్యూమోనియా దినం పురస్కరించుకుని బుధవారం 17వ వార్డులో అవగాహన సదస్సు నిర్వహించారు. 'శ్వాస సంబంధిత సమస్యల్లో న్యూమోనియా ప్రాణాంతకమైనది. ముందస్తు గుర్తింపుతో ప్రాణాలను కాపాడుకోవచ్చు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలోపు పిల్లల్లో శ్వాస సంబంధిత వ్యాధి లక్షణాలను గుర్తించాలి.' అని తెలిపారు. అనంతరం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

సందడిగా కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల రాణింపు

8లో

మొంథా ప్రభావం.. రోడ్లు ఛిద్రం

- గోతులమయమై.. కోతకు గురైన వైనం
- జిల్లాలో అధ్వానంగా మారిన రహదారులు
- గిరిజన ప్రాంతాల్లో పరిస్థితి సరేసరి..
- వాహనదారులు, ప్రయాణికులకు తప్పని అవస్థలు



గుమ్మలక్ష్మీపురం: రాళ్లు తేలిపోయిన దేరువాడ-వనకాబడి రోడ్డు

పార్వతీపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో పలుచోట్ల రహదారులు అధ్వానంగా మారాయి. కోతకు గురై.. గోతులమయమయ్యాయి. అనేక చోట్ల కల్వర్టులు కూడా కుంగిపోయాయి. వంతెనలు మరింత ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక గిరిజన రహదారుల పరిస్థితి సరేసరి. రాళ్లు తేలి దారుణంగా తయారయ్యాయి. దీంతో చాలాచోట్ల ప్రజలు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. రోడ్డు సదుపాయం లేక 108 వాహనాలు ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లడం లేదు. గిరిపుత్రులు అత్యవసర వేళల్లో వైద్య సేవలు పొందలేకపోతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు చేరు కోలేకపోతున్నారు. అటవీ ఉత్పత్తులు, పంటలను సైతం కాలి నడకన కొండ దిగి విక్రయించుకోలేకపోతున్నారు. కొన్ని గ్రామాల్లో గిరిజనులు శ్రమదానం చేసి రహదారులపై గుంతలను పూడ్చి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి మొంథా తుఫాన్ ధాటికి ఛిద్రమైన రహదారులను బాగు చేయించాలని జిల్లావాసులు కోరుతున్నారు. దీనిపై ఆర్ అండ్‌బీ జిల్లా ఇంజనీరింగ్ అధికారి రాధాకృష్ణను వివరణ కోరగా.. 'మొంథా తుపాను ప్రభావంతో మన్యంలో రహదారులకు ఏర్పడిన నష్టంపై కలెక్టర్‌కు నివేదించాం. కొన్ని రహదారుల మరమ్మతులకు సుమారు రూ.16 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపించాం.' అని తెలిపారు.



సీతంపేట రూరల్ : ఇటీవల కురిసిన వర్షాలకు ఛిద్రమైన రేగులగూడ రహదారి

ప్రత్యేక కథనం 6లో

● విజయనగరం జిల్లాలో రూ.79 కోట్ల నష్టం
● కొట్టుకుపోయిన వేగవతి నదిపై కాజ్‌వే
● మొంథా తుఫాన్ మిగిల్చిన నష్టం

ఆ రోడ్లు.. ఛిద్రం



కొట్టుకుని పోయిన కాజ్‌వే..

పారాది వద్ద వేగావతి నదిపై కొట్టుకుపోయిన కాజ్‌వే..



పార్వతీపురం రూరల్: చొక్కాపువానివలస రహదారిలో కుంగిన కల్వర్టు

రహదారులకు మొంథా తుఫాన్ తీవ్ర నష్టం కలిగించింది. విజయనగరంలో పలు పట్టణ, గ్రామీణ రోడ్లు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బందిగా మారింది. బొబ్బిలి సమీపాన వేగవతి నదిపై నిర్మించిన కాజ్‌వే మళ్లీ కొట్టుకుని పోయింది. ఎస్.కోట పట్టణాన్ని ఆనుకుని ఉన్న విశాఖ-అరకు ప్రధాన రహదారి పలుచోట్ల ఛిద్రమై పోయింది.



బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో రోడ్డు దుస్థితి

బొబ్బిలి/రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొంథా తుపాన్ వల్ల రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. బొబ్బిలి-రామభద్రపురం, బొబ్బిలి-తెర్లాం రోడ్లు అధ్వానంగా మారాయి. ద్విచక్రవాహనదారులు, ఆటోలు, ఇతర వాహనాల రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అలజంగి, కారాడ, గొల్లపల్లి, పినపెంకి జంక్షన్‌లలో తరచుగా లారీలు కుంగిపోతున్నాయి. పారాది కొత్త వంతెన నిర్మాణం కోసం వేగావతినదిపై గత ప్రభుత్వ హయాంలో రూ. 92 లక్షలతో నిర్మించిన కాజ్‌వే లెక్కలేనన్ని సార్లు కొట్టుకుపోయింది. మొంథా తుపాన్‌తో వరదనీటికి ఈ కాజ్‌వే నామరూపాల్లేకుండా పోయింది. దీనికి మళ్లీ రూ.12లక్షలు అవసరం ఉంటుందని నివేదించగానే జిల్లా కలెక్టరు నిధులను మంజూరు చేశారు. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు పనులకు శ్రీకారం చుట్టారు. బొబ్బిలి పట్టణ పరిధిలో ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి, పాతబొబ్బిలి జంక్షన్ రోడ్డు, కాలేజీ రోడ్డు వర్షానికి మరింతగా పాడైపోయాయి. బొబ్బిలి కాలేజీ రోడ్డు, పూల్‌బాగ్, గొల్లపల్లి బైపాస్ మీదుగా తెర్లాం వరకు ఏ వాహనాల్లో వెళ్లాలన్నా సాహసం చేయాల్సిందే.

కొండపాలెం-కోడూరు రహదారి..



అధ్వానంగా కొండపాలెం-కోడూరు రహదారి

గరివిడి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గరివిడి నుంచి కొండపాలెం మీదుగా కోడూరుకు ఉండే రహదారి మొంథా తుపానుకు అధ్వాన్నంగా మారింది. రోడ్డు మధ్యలో గుంతలు పడింది. రోడ్డు చివరన చాలావరకు కోతకు గురైంది. ఈ రహదారిని ఆనుకుని ప్రభుత్వ పాఠశాల కూడా ఉంది. ఈ రహదారి వెంబడి ప్రయాణించేందుకు వాహనచోదకులు, విద్యార్థులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఛిద్రమైన విశాఖ-అరకు రోడ్డు..



ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద విశాఖ-అరకు రహదారి

శృంగవరపుకోట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తుపాన్ కారణంగా ఎస్.కోట పట్టణాన్ని ఆనుకుని ఉన్న విశాఖ-అరకు ప్రధాన రహదారి ఛిద్రమై పోయింది. ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు దారుణంగా ఉంది. ఇక్కడ రోడ్డు దెబ్బతిని ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఈ రోడ్డులో అక్కడక్కడా గుంతలు పడ్డాయి. కొన్నిచోట్ల తాత్కాలికంగా మరమతులు చేసినా మళ్లీ మొదటిస్థితికి వచ్చాయి.

చీపురుపల్లిలో..



గోతులమయంగా మారిన రావివలస రోడ్డు

చీపురుపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి మండలంలో పంటలకు పెద్దగా నష్టం వాటిల్లకపోయినా.. రహదారులు మాత్రం ఛిద్రమయ్యాయి. చీపురుపల్లి నుంచి రామలింగపురం, రావివలస బీటీ రోడ్డు పూర్తిగా పాడై పోయింది. గుంతలు పడి వాహన చోదకులకు నరకాన్ని చూపిస్తోంది. రావివలస రోడ్డులో మట్టి తేలిపోవడంతో, నిత్యం ఆ రోడ్డుపై ప్రయాణం చేసే రావివలస, పైలపేట, కొత్తపేట, గురానపేట, ఆర్థివలస తదితర గ్రామాల ప్రజలు అవస్థలు అనుభవిస్తున్నారు. రామలింగపురం రహదారి కూడా పాడవ్వడంతో రామలింగపురం, విశ్వనాధపురం, గరివిడి మండలంలోని చుక్కవలస తదితర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రామభద్రపురంలో..

రామభద్రపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రామభద్రపురం నుంచి రాజాం వెళ్లే రోడ్డు గోతులయమైంది. బొబ్బిలివైపు వెళ్లే రోడ్డు కూడా పూర్తిగా పాడైపోయింది. వీటితోపాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లది కూడా ఇదే పరిస్థితి. కోటశిర్లాం నుంచి ఎనుబరువు వెళ్లే రోడ్డు పూర్తిగా పాడై పోయింది.



రామభద్రపురం నుంచి బాడంగి వైపు వెళ్లే రహదారి దుస్థితి

గజపతినగరంలో..



పురిటిపెంట-గంగచోళ్లపెంట గ్రామాల మధ్య గోతులమయమైన బీటీ రోడ్డు

గజపతినగరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పురిటిపెంట నుంచి గంగచోళ్లపెంటకు వెళ్లే బీటీ రోడ్డు గజానికో గుంతగా ఏర్పడింది. వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. గజపతినగరం దిగువ వీధిలో పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద రోడ్డు కోతకు గురయింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.



గరుగుబిల్లి: సీతారాంపురం సమీపంలో రహదారి అంచులు కోతకు గురైన దృశ్యం

గోతులమయమై.. కోతకు గురై..

గరుగుబిల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ కారణంగా పార్వతీపురం నుంచి పాలకొండ వైపు వెళ్లే ప్రధాన రహదారి మార్గం అధికంగా కోతకు గురైంది. కొన్నిచోట్ల రహదారి కుంగింది. సీతారాంపురం నుంచి సంతోషపురం పంచాయతీ ఖడ్గవలస పరిధిలో మార్గం అడుగడుగునా గోతులమయంగా మారింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ● కురుపాం రూరల్ నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వలస బల్లేరు పంచాయతీ పరిధిలో ఆగంగూడ గ్రామానికి వెళ్లే రోడ్డు కోతకు గురైంది. తక్షణం మరమ్మతులు చేపట్టి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ● పార్వతీపురం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు పార్వతీపురం మండలంలో ఎం.ఆర్.నగరం రహదారి గోతులమయంగా మారింది. చొక్కాపువానివలస దారిలో కల్వర్టు కుంగింది. వెంకంపేట గోలీల నుంచి కోరాపుట్ వెళ్లే రహదారి దారుణంగా తయారైంది. ● పాలకొండ, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నుంచి రాజాం, పార్వతీపురం శ్రీకాకుళం, సీతంపేటకు వెళ్లే రహదారులు పలు చోట్ల దెబ్బతిన్నాయి. మంగళాపురం- సంకిలి మధ్య ఉన్న వంతెన అధ్వానంగా మారింది. పెచ్చులూడి ఇనుపచువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. భారీ వాహనాలు వెళ్లే క్రమంలో వంతెన ఊగిసలాడుతుంది. నవగాం, పొట్లి, పాలకొండ-లుంబూరు, పాలకొండ-ఓని తదితర రహదా రులు మరింత అధ్వానంగా మారా యి. ● సీతంపేట రూరల్/గుమ్మ లక్ష్మీపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలంలో బొమ్మిక, చాకలిగూడ, కడగండి, గుడ్డి మీదగూడ, రంగంవలస, ఎగువదారబ, పొంజాడ, పెద్దగూడ, ఎగువ, దిగువ ద్వారబంధం, జాతాపు జగతిపల్లి, వంబరెల్లి, సామరెల్లి, పెద్దగూడ, రేగుమానుగూడ తదితర గ్రామాల రహదారులు పూర్తిగా పాడయ్యాయి. దీంతో గిరిజనులకు రవాణా కష్టాలు మొదలయ్యాయి. విద్య, వైద్య సేవలు సకాలంలో అందక గిరిపుత్రులు ఇబ్బందులు పడుతున్నారు. అటవీ ఉత్పత్తులు కాలినడకన కొండ దిగువకు తీసుకొచ్చే పరిస్థితులు నెలకొన్నాయి. ఇక గుమ్మలక్ష్మీపురం మండలంలో దేరువాడ-వనకాబడి రహదారి రాళ్లు తేలి అధ్వానంగా మారింది. దీంతో వనగాబడి గ్రామస్థులు, సచివాలయ ఉద్యోగులు ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో ఐటీడీఏ ఇంజనీర్లు ఈ రహదారిని గ్రావెల్ రోడ్డుగా మార్చారు. ప క్కా రోడ్డు నిర్మించకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు కంకర కూరుకుపోయి రాళ్లు తేలిపోయాయి.



కురుపాం రూరల్: కోతకు గురైన ఆగంగూడ రోడ్డు



పాలకొండ: నాగావళి వంతెనపై పెచ్చులూడిన దృశ్యం

ఆలయ అభివృద్ధికి కృషి చేయండి

● గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి
● శంబర పోలమాంబ ఆలయ ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం
● చైర్మన్‌గా నైదాన చినతిరుపతి



ట్రస్టు బోర్డు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి సంధ్యారాణి

మక్కువ రూరల్/సాలూరు, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ ఆలయ అభివృద్ధికి ట్రస్టు బోర్డు కృషి చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి అన్నారు. బుధవారం శంబరపోలమాంబ చదురుగుడి ఆలయ ఆవరణలో నిర్వహించిన ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత ఆమె అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె.. ట్రస్టు బోర్డు చైర్మన్ నైదాన చినతిరుపతితో పాటు తొమ్మిది మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ట్రస్టు బోర్డు, అధికారులు సమన్వయంతో ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్నారు. తాను అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రూ.3 కోట్లతో పోలమాంబ ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వనంగుడిని అభివృద్ధి చేసేందుకు మరో రూ.కోటి సిద్ధంగా ఉన్నాయన్నారు. జనవరి 26 నుంచి నాలుగు నెలల పాటు పోలమాంబ జాతర ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులకు మెరుగైన సేవలందించాలన్నారు. ఇదిలా ఉండగా తొలుత శంబరకు విచ్చేసిన మంత్రికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. తెలుగు యువత నాయకులు నైదాన సూర్యయాదవ్ ఆధ్వర్యంలో కోలాట బృందాలు, తప్పిటగుళ్లు, డొంగురు మేళాలు, బాణసంచా కాలుస్తూ చదురుగుడి ప్రాంగణం వరకూ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమం పోలమాంబ ఆలయం ఈవో బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగింది. మక్కువ మండల టీడీపీ అధ్యక్షుడు గుల్ల వేణుగోపాలనాయుడు, మెంటాడ మండల అధ్యక్షుడు చలుమూరు వెంకటరావు, సాలూరు పట్టణ అధ్యక్షుడు నిమ్మాది చిట్టి, మండల అధ్యక్షుడు ఆముదాల పరమేశ్వరావు, పాచిపెంట అధ్యక్షుడు గూడేపు యుగంధర్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కష్టపడిన వారికి పదవులు

● ప్రజలను తప్పుదోవ పట్టించాలన్నదే వైసీపీ ఉద్దేశం
● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



పార్టీ మండలాధ్యక్షులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): పార్టీలో కష్టపడిన వారికి ఉన్నతపదవులు లభిస్తాయని మంత్రి కొండపల్లిశ్రీనివాస్ తెలిపారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అని ప్రజలను తప్పుదోవ పట్టించాలన్నదే వైసీపీ ఉద్దేశ్యమని చెప్పారు. బుధవారం గజపతినగరంలో నియోజకవర్గస్థాయిలో పార్టీ మండలాధ్యక్షుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీహయాంలో తీసుకువచ్చిన ఐదు మెడికల్ కళాశాలలకు రూ.500కోట్లు ఖర్చు చేసి గాలికి వదిలేసారన్నారు. అనంతరం గజపతినగరం, గంట్యాడ, బొండపల్లి, జామి,దత్తిరాజేరు పార్టీ మండలాధ్యక్షులుగా గంట్యాడశ్రీదేవి, కొండపల్లి భాస్కరనాయుడు, రాపాక అచ్చంనాయుడు, పోలుపర్తి స్వామినాయుడు, చప్పా చంద్రశేఖర్‌తోపాటు మండల క్లస్టర్, యూనిట్, బూత్, గ్రామకమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు కోటేశ్వరరావు, పార్టీ నాయకులు కొండపల్లి కొండలరావు, ఏఎంసీ చైర్మన్ వీవీవీ గోపాలరాజు, పీఏసీఎస్ చైర్మన్ లెంక బంగారునాయుడు, గజపతినగరం, బొండపల్లి మండలాల జడ్పీటీసీ మాజీ సభ్యులు మక్కువ శ్రీధర్, బండారు బాలాజీ పాల్గొన్నారు.

ఉన్నత విద్యతో బంగారు భవిష్యత్: ఎస్పీ



స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులతో ఎస్పీ ఏఆర్ దామోదర్

విజయనగరంక్రైమ్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యతో బంగారు భవిష్యత్ సాధ్యమని, అందుకు తగ్గట్టుగా విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా క్రమశిక్షణతో విద్యను కొనసాగించాలని ఎస్పీ ఏఆర్.దామోదర్ కోరారు. విజయనగరంలో పోలీస్ సంక్షేమ పాఠశాలకు చెందిన 16 మంది విద్యార్థులకు హోంగార్డు సంక్షేమంలో భాగంగా 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రతిభ కనబరచడంతో రూ.రెండు వేలు చొప్పున స్కాలర్‌షిప్పులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను ఎన్నడూ నిర్లక్ష్యం చేయరాదని, ఉపాధ్యాయులు సహకారంతో ఎప్పటికప్పుడు తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. ప్రతివిద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని నిర్ధేశించుకుని గమ్యం చేరేందుకు శతశాతం కృషిచేయాలన్నారు. హోంగార్డులు పిల్లలను ప్రోత్సహించేందుకు మెరిట్ స్కాలర్‌షిప్పులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీసౌమ్యలత, వెల్ఫేర్ ఆర్ఐ ఎస్.గోపాలనాయుడు పాల్గొన్నారు.

రుణ ప్రతిపాదనలు సిద్ధం చేయండి: పీడీ

చీపురుపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):డ్వాక్రా సంఘాలకు సీఐఎఫ్ కింద మంజూరు చేయనున్న రుణాలపై ప్రతిపాదనలు నాలుగు రోజుల్లో సిద్ధం చేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసపాణి ఆదేశించారు.బుధవారం చీపురుపల్లి వెలుగు కార్యాలయంలో జరిగిన మండల సమాఖ్య సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త అప్పుల మంజూరుకోసం తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి, మండల సమాఖ్య కార్యాలయానికి అందజేయాలన్నారు. ప్రతినెలా జరిగే మండల సమాఖ్య సమావేశానికి గ్రామైక్య సంఘాల అధ్యక్షులు హాజరు కావాలన్నారు. ఇప్పటి వరకూ ఉన్న సీఐఎఫ్ రుణ బకాయిలు వచ్చే సర్వసభ్య సమావేశం నాటికి చెల్లించాలన్నారు. సమావేశంలో ఏపీఎం ఎన్. అప్పలనాయుడు, ఎల్‌సీ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసపాణి



ఏనుగులు సంచరిస్తున్న దృశ్యం

గజరాజులతో భయం.. భయం

కొమరాడ, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగుల గుంపు బుధవారం సాయంత్రానికి పూజారిగూడ, చిడిపల్లి గ్రామాల మధ్య సంచరిస్తోంది. వరి పంటలను ధ్వం సం చేశాయి. వరి కోతల కాలంలో ఏనుగులు పంట పొలా ల్లో సంచరిస్తుండడంతో రైతులు భయపడుతున్నారు. వరి, పత్తి, ఆయిల్‌పామ్ పంటల్లో ఏనుగుల గుంపు సంచరి స్తుండటంతో రైతులు పంటలు చూసేందుకు వెళ్లలేక పోతున్నారు. తక్షణమే ఏనుగుల గుంపును తరలించాలని రైతులు కోరుతున్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం

● జిల్లా వ్యాప్తంగా ఆవాస్ యోజన ఇళ్ల ప్రారంభం

ప్రతిఒక్కరికీ సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయమని ఎమ్మెల్యేలు తెలిపారు. బుధవారం జిల్లాలోని పలుచోట్ల ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0 కార్యక్రమంలో భాగంగా నిర్మాణం పూర్తిచేసిన గృహాలను



లక్కవరపుకోట: మంగళపాలెంలో నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

ఎమ్మెల్యేలు ప్రారంభించి లబ్ధిదారులకు అప్పగించారు.

● విజయనగరం టౌన్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి పేదవాడికి సొంతిళ్లు ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు తెలిపారు. మండలంలోని దుప్పాడలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వినితో కలిసి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0 కార్యక్రమంలో భాగంగా నిర్మాణం పూర్తిచేసినగృహాలను ప్రారంభించి లబ్ధిదారులకు అప్పగించారు.ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలకు స్థలాలను మంజూరుచేయడంతో పాటు,వాటి నిర్మాణాలకు రుణాలను కూడా ఇచ్చి లబ్ధిదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోలినాయుడు పాల్గొన్నారు.

●లక్కవరపుకోట(కొత్తవలస),నవంబరు12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 17 నెలలు కాలంలో మూడు లక్షల ఇళ్లు మంజూరుచేసి లబ్ధిదారులకు అందజేశామని ఎస్.కోట ఎమ్మెల్యే లలిత కుమారి తెలిపారు. కొత్తవలస మండలంలోని మంగలపాలెంలో నూతన గృహాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పీవీ రత్నాజీ, కోళ్ల శ్రీను, బొబ్బిలి అప్పారావు, ఎల్లపు సూరిబాబు పాల్గొన్నారు.



విజయనగరం టౌన్: దుప్పాడలో ఇంటిని ప్రారంభిస్తున్న ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే అదితిగజపతిరాజు

●రాజాం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి పేదవాడికి 2029 నాటికి సొంతిళ్లు ఉండాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. శ్యాంపురంలో నూతన గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, రూరల్ అధ్యక్షుడు సుమల వెంకటమన్మథరావు, నారాయణరావు,లచ్చుభుక్త ధనలక్ష్మి,శాసపు రమేష్ కుమార్, సమతం శ్రీను, గణేష్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

చెరువులో ఆక్రమణ తొలగింపునకు చర్యలు



ఆక్రమిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమణమ్మ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భోగాపురం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెపువలసలో ఎయిర్‌పోర్టుకు సమీప చెరువులో ఆక్రమణ తొలగింపుకు తహసీల్దార్ రమణమ్మ చర్యలు చేపట్టారు. ఈనెల 12న ఆంధ్రజ్యోతి దినపత్రికలో జాగా కనిపిస్తే పాగా శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో తహసీల్దార్ రమణమ్మ బుధవారం వెళ్లి ఆక్రమణకు గురైన చెరువును పరిశీలించారు. ఆక్రమణదారులతో మాట్లాడి ఆక్రమణ తొలగించాలని హెచ్చరించారు. వీఆర్వో వాక్‌దేవి మాట్లాడుతూ బుధవారం తొలగించాలని హెచ్చరించామని, వారు తొలగించకపోతే గురువారం తామే తొలగిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు.

15న ఉపకరణాల గుర్తింపు

శృంగవరపుకోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట భవిత కేంద్రంలో ఈనెల 15న దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం నిర్వహించనున్నట్లు ఎంఈవోలు బి.నర్సింగరావు, పి.గణపతి లక్ష్మి తెలిపారు.జామి, వేపాడ, ఎల్.కోట, కొత్తవలస, ఎస్.కోట మండలాలకు చెందిన 18 ఏళ్ల లోపు చెవిటి, మూగ, మానసిక, శారీరక దివ్యాంగులు హాజరుకావాలని కోరారు.

పైడిమాంబ హుండీ ఆదాయం రూ.20.97లక్షలు

విజయనగరం కల్చరల్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయం వీధిలోని అమ్మవారి కల్యాణమండపంలో పైడిమాంబ చదురుగుడి హుండీ ఆదాయం దేవదాయశాఖ కమిషనర్, ఇన్‌చార్జి ఈవో కె.శిరీష పర్యవేక్షణలో బుధవారం లెక్కించారు.పర్యవేక్షకురాలు వెంకటరమణి, పాలకమండలి సభ్యులు సమక్షంలో హుండీ ఆదాయం లెక్కించారు. 29 రోజులకుగాను రూ.20,97,852 నగదు, 15 గ్రాముల 200 మిల్లీగ్రాములు బంగారం, 260గ్రాములు వెండి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

వ్యక్తిగత పనులకు ప్రోత్సాహం

మెరకముడిదాం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో వ్యక్తిగత పనులకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, పనులు గుర్తించి పనులను వేగవంతం చేయాలని సిబ్బందికి ఎంపీడీవో జి.భాస్కరరావు సూచించారు. బుధవారం మెరకముడిదాం పంచాయతీలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పరిశీలించారు.

ఉల్లాస్‌పై వలంటీర్లకు శిక్షణ

గంట్యాడ నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):గంట్యాడలో అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉల్లాస్‌పై బుధవారం 400 మంది వలంటీర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ హైమావతి మాట్లాడుతూ గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాసులను చేయాలని చెప్పారు.కార్యక్రమంలోని ఎంపీడీవో రమణమూర్తి, వెలుగు ఏపీఎం సులోచనదేవి, ఏపీవో సుందరరావు పాల్గొన్నారు

వెయిట్‌లిఫ్టర్‌కు అభినందన

భోగాపురం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): భోగాపురం పంచాయతీలోని చెరువుకొమ్ము గొల్లపేటకు చెందిన కోడ్రు కృష్ణ రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించడంతో పోలిపల్లిలో మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజును కలిశారు.ఈమేరకు కృష్ణను అభినందించారు.

సిబ్బంది అందుబాటులో ఉండాలి

దత్తిరాజేరు, నవంబరు12(ఆంధ్ర జ్యోతి):సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండి సక్రమంగా సేవలు అందించాలని ప్రత్యేకాధికారి విమలా రాణి కోరారు. బుధవారం మండలంలోని పెదమానాపురం, దత్తి, వంగర, పెదకాద సచివాలయాలను పరిశీలించారు.

రెవెన్యూ వసూళ్లను వేగవంతం చేయండి

● మునిసిపాలిటీల రీజనల్ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ నల్లనయ్య

విజయనగరం టౌన్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): పేరుకుపోయిన రెవెన్యూ వసూళ్లను వేగవంతం చేయాలని ఇన్‌చార్జి మునిసిపాలిటీ రీజనల్‌జాయింట్ డైరెక్టర్, విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య కోరారు. బుధవారం విజయనగరంలో రీజియన్ పరిధిలో ఉన్న అన్ని మునిసిపాలిటీల రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు, నీటి చార్జీల వసూళ్లు వేగవంతం చేయాలని కోరారు. పన్ను పరిధిలోకి రాని ఆస్తి వివరాలను నమోదు చేసి పన్ను విధించేందుకు చర్యలను చేపట్టాలని కోరారు. పేరమిత్ర యాప్ ద్వారా కార్పొరేషన్ సేవలను పొందేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో సహాయకమిషనర్ అప్పలరాజు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల సమస్యలను పరిష్కరించాలి

అభివృద్ధి పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లను ఇబ్బందిపెట్టే యోచన లేదని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. ఇంజనీరింగ్, అకౌంట్స్ విభాగాలు రెండు సమన్వయంతో పనిచేసి వారంరోజుల్లోగా కాంట్రాక్టర్ల సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖల సిబ్బందికి ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో కాంట్రాక్టర్లతో సమావేశమయ్యారు. సమావేశంలో ఈఈప్రసాద్, గణాంక అధికారి రోజా, నర్సింగరాజుపాల్గొన్నారు. అలాగే విజయనగరంలోని పార్కులు, చెరువులను పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ నల్లనయ్య కోరారు. నగరంలోని అయ్యవారి కోనేరును పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కోనేరుచుట్టూ ఉన్న వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేసి వాకర్స్‌కు అనువుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

● రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్



పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న కోండ్రు మురళీమోహన్

రాజాం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కోరారు. బుధవారం రాజాంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు గ్రామాలకు వెళ్లి మద్దతు ధర విషయంలో ముమ్మరంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ఏడీ రవికిరణ్, సీసీఐ అధికారి బైయార్, మార్కెట్ కమిటీ కార్యదర్శి సమతం శ్రీనివాసరావు, ఛైర్మన్ గురవాన పార్వతి వైస్ ఛైర్మన్ లచ్చుభుక్త ధనలక్ష్మి, నాయకులు నంగి సూర్యప్రకాషరావు, గురవాన నారాయణరావు, వంగా వెంకటరావు,శాసపు రమేష్‌కుమార్, టంకాల నాగరాజు, నాగళ్ల అప్పలనాయుడు పాల్గొన్నారు,

నిధులు మంజూరుకు కృషి చేయాలి

మార్కెట్ కమిటీల ద్వారా లింక్ రోడ్ల నిర్మాణం, పశువైద్యశిబిరాలు, నిర్వహించడం తోపాటు వివిధ అభివృద్ధికార్యక్రమాలకు నిధులు మంజూరుచేసేలా కృషి చేయాలని ఉమ్మడి విజయనగరం జిల్లాతో పాటు మన్యం జిల్లాలకు చెందిన ఏఎంసీ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు కోరారు.ఈ మేరకు శ్యాంపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు.

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయమని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు.శ్యాంపురం క్యాంపుకార్యాలయంలో రాజాం టౌన్, రాజాం రూరల్, వంగర, సంతకవిటి, రేగిడి మండల టీడీపీ గ్రామ, వార్డు కమిటీ, క్లస్టర్, బూత్, యూనిట్ కమిటీల ప్రమాణ స్వీకారకార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కొల్ల అప్పలనాయుడు, బొత్స వాసుదేవరావునాయుడు, దుప్పలపూడి శ్రీనివాసరావు, వంగా వెంకటరావు, దూబ ధర్మారావు, గట్టి భాను, గట్టి రఘు, వల్లూరు గణేస్, సమతం శ్రీను పాల్గొన్నారు

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి

● నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి

భోగాపురం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి కోరారు. బుధవారం భోగాపురం మండల పరిషత్ కార్యాలయంలో జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో డీడీ స్వరూపారాణి, తహసీల్దార్ రమణమ్మ, ఈవోపీఆర్డీ గాయిత్రి, నాయకులు పల్లంట్ల జగదీష్, మట్టా అయ్యప్పరెడ్డి పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

మాక్ అసెంబ్లీతో రాజ్యాంగంపై అవగాహన

శృంగవరపుకోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాక్ అసెంబ్లీతో విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన పెరుగుతుందని ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకుడు దొడ్డి సూర్యారావు తెలిపారు. బుధవారం శృంగవరపుకోటలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ రాష్ట్ర మానవ వనరుల, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు. స్పీకర్, సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికార, ప్రతిపక్ష సభ్యులు శాసనసభలో నిర్వహించే పాత్రలను విద్యార్థులు అర్థం చేసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు సీహెచ్ రామకృష్ణ, ఎల్. సాంబమూర్తి, ఎం.అప్పారావు పాల్గొన్నారు.

అభివృద్ధికోసం కలిసి పనిచేయాలి: అదితి

విజయనగరం కల్చరల్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికోసం ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని విజయనగరం ఎమ్మెల్యే అదితిగజపతిరాజు కోరారు. బుధవారం విజయనగరం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విజన్-2047 ప్రకారం ప్రతిఒక్కరూ అభివృద్ధికోసం సమష్టిగా పనిచేయాలని కోరారు. 2025-26 సవరణ, 2026,-27 అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. 2025-26 లో రాబడులు రూ.84.25,58,560 ఖర్చులు రూ.84.65.67.666, 2026-27 అంచనా బడ్జెట్ రూ.93.71.71.000ఖర్చులు రూ.94.23,25,000గా రూపొందించారు. తొలుత మామిడి అప్పలనాయుడు శాఖలు వారీగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో గంటా వెంకటరావు, తహసీల్దార్ కూర్మనాథ్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, కొసర నిర్మల పాల్గొన్నారు

మాజీ సైనికుల కుటుంబాలకు అండగా ఉంటాం

రాజాం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులు, వారి కుటుంబాలకు అండగా ఉంటామని, వారికి వర్తించే సంక్షేమ పథకాలు పొందేలా సహకరిస్తామని సైనిక్‌వెల్ఫేర్ ఆఫీసర్ కేవీఎస్‌ప్రసాదరావు తెలిపారు. బుధవారం రాజాంలో నాలుగు మండలాలకు చెందిన మాజీ సైనికులు, వీరనారీలతో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ సైనికులకు వర్తించే సంక్షేమ పథకాల గురించి వివరించారు. సమావేశంలో సంఘ రాజాం శాఖ ఛైర్మన్ ఉమామహేశ్వరరావు, సంఘ అధ్యక్షుడు సురేష్, పొట్టా అప్పలరాజు పాల్గొన్నారు.

రావివలసలో పంటకోత ప్రయోగం

గంట్యాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రావివలసలో బుధవారం నిర్వహించిన పంటకోత ప్రయోగాన్ని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ తారాకరామారావు పరిశీలించారు. తొలుతగుర్తించిన యూనిట్‌లో వరిచేను కోసి అందులో ధాన్యం నూర్పు చేశారు. ఈ ప్రయోగంలో 13.5 కేజీలు దిగుబడి వచ్చింది. కార్యక్రమంలోని ఏడీలు నాగభూషన్, భారతి , ఏవోలు నిర్మల, శ్యామ్ కుమార్, ఏఈవో పాల్గొన్నారు.

వేతన బకాయిలను చెల్లించాలి

గజపతినగరం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): గజపతినగరం, పురిటిపెంట గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు వేతనబకాయిలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లాఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి కోరారు. బుధవారం గజపతినగరం గ్రామ సచివాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అంధకారంలో 20గ్రామాలు

రేగిడి, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉంగరాడమెట్ట సబ్‌స్టేషన్ పరిధిలో సంకిలి ఫీడర్‌లో బుధవారం మధ్యాహ్నం సమస్యలు తలెత్తడంతో 20 గ్రామాల్లో అంధకారంలో నెలకొంది. రాత్రి పదిగంటల సమయంలో సిబ్బంది విద్యుత్ సరఫరా పునరుద్ధరించినా మళ్లీ నిలిచిపోయింది. లక్ష్మీపురం వద్ద జంపర్లు కట్ అవ్వడం, మరో రెండుచోట్ల వైర్లు తెగిపోవడంతో సరఫరా నిలిచిపోయిందని ఏఈ సురేష్ తెలిపారు.

గాయత్రీ మాత సన్నిధిలో హీరో సాయికుమార్

లక్కవరపుకోట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):కల్లేపల్లి-రేగలో వేదమాత గాయత్రిదేవిని సినీహీరో పూడిపెద్ది సాయికుమార్ బుధవారం దర్శించుకున్నారు. అరకులో షూటింగ్‌కు వెళ్తున్న క్రమంలో చిత్ర బృందంతో కలిసి కల్లేపల్లి వచ్చారు. గ్రామంలోని ఆయన చిన్నాన్న కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం రేగలో వెలసిన వేదమాత గాయత్రీదేవిని దర్శించుకున్నారు. కాశీ శివలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. సాయికుమార్ వచ్చారని తెలుసుకున్న కల్లేపల్లి-రేగ,లచ్చింపేటనుంచి భారీఎత్తున ప్రజలు వచ్చారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సెల్ఫీలు, ఫోటోలు దిగారు. తండ్రి పీజే శర్మ, జ్ఞాపకార్థం కల్లేపల్లిలో కళ్యాణ మండపం నిర్మించే ఆలోచన ఉందని ఆయన తెలిపారు.



గాయత్రీదేవి ఆలయం వద్ద చిత్ర యూనిట్‌తో సాయికుమార్

అనుమతులు లేకుండా ర్యాలీలు

● జిల్లా వ్యాప్తంగా అడ్డుకున్న పోలీసులతో వైసీపీ శ్రేణుల వాగ్వాదం

మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో నిర్మించి నిర్వహించేందుకు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం జిల్లాలో వైసీపీ శ్రేణులు నిర్వహించిన నిరసన ర్యాలీలకు ఆ పార్టీ శ్రేణులు అనుమతి తీసుకోకపోవడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆ పార్టీ శ్రేణులు వాగ్వాదానికి దిగాయి.

● రాజాం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):రాజాంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలేరాజేష్ సారధ్యంలో కార్యకర్తలతో తహసీల్దార్‌కార్యాలయం వరకూ ర్యాలీ చేయాలని నిర్ణయించారు. అయితే ర్యాలీకి అనుమతిలేకపోవడంతో టౌన్ సీఐ అశోక్ కుమార్ ఆధర్యంలో పోలీసులు పాలకొండరోడ్‌లో నిలిపివేశారు. దీంతో పోలీసులతో అక్కడ వాగ్వాదానికిదిగారు. అనంతరం డీటీకి వినతి పత్రం అందజేశారు.కాగా బైక్‌ర్యాలీలో మోడిఫైడ్ సైలెన్సర్లతో పాల్గొన్న రెండు బుల్లెట్ వాహనాలను ఎస్ఐ రవికిరణ్ అడ్డుకున్నారు. విషయంతెలుసుకున్న వైసీపీ నాయకులు తహసీల్దార్ రాజశేఖర్‌తోపాటు అక్కడే ఉన్న సీఐ అశోక్‌కుమార్‌తో వాగ్వాదానికి దిగారు. మూడురోజుల్లో సైలెన్సర్లను మార్చి చూపిస్తామని వైసీపీ నాయకులు హామీ ఇవ్వడంతో పోలీసులు ఆ రెండు వాహనాలను యజమానులకు అప్పగించారు.



చీపురుపల్లి: మాట్లాడుతున్న సత్యనారాయణ

●శృంగవరపుకోట, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలో అనుమతి లేకుండా నిర్వహించిన ర్యాలీని అడ్డుకోవడంతో పోలీసులు, వైసీపీ శ్రేణుల మధ్య తోపులాట జరిగింది.తొలుత విశాఖ-అరకురోడ్డులో ర్యాలీగా బయలుదేరిన వైసీపీ శ్రేణులను సీఐ వ్రరి నారాయణమూర్తి, పోలీసులు అడ్డుకుని అనుమతిలేకుండా ర్యాలీ చేపట్టవద్దని సూచించారు. అయినా కార్యకర్తలు ముందుకు సాగడంతో సీఐ, పోలీసులు రోప్ కట్టి అడ్డగించడంతో వాగ్వాదం జరిగింది.ఈక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు రోపును తోసుకొని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చి వెళ్లిపోతామని పేర్కొనడతో కొందరి నాయకులను అనుమతించారు.

●గరివిడి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీ గరివిడిలో ఉద్రిక్తంగా మారింది. పెనుబర్తి సెంటర్ నుంచి బైక్‌ర్యాలీగా వస్తున్న వైసీపీ శ్రేణులను గరివిడి పోలీసులు రైల్వేబ్రిడ్జి సమీపంలో అడ్డుకున్నారు. పోలీసులకు, వైసీపీ శ్రేణులకు వాగ్వాదం, తోపులాట జరిగింది. దీంతో గరివిడి, చీపురుపల్లి వైపు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈట్రాఫిక్‌లో వైసీపీ నిరసనకార్యక్రమానికి చీపురుపల్లి వెళ్తున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ వాహనం కూడా సుమారు గంటపాటు ట్రాఫిక్‌లో నిలిచిపోయింది. పోలీసులు చొరవతీసుకొని ట్రాఫిక్‌క్లియర్ చేశారు.

● చీపురుపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయడం ద్వారా ప్రభుత్వం పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతోందని శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. వైద్య కళాశాల ప్రైవేటీకరణపై వైసీపీ ఆధ్వర్యంలో చీపురుపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

అదుపు తప్పి.. ఇంజన్ వేరుపడి..

● అరసాడలో ట్రాక్టర్‌కు తప్పిన పెను ప్రమాదం

వంగర, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అరసాడలో మంగవారం అర్ధరాత్రి కర్రల లోడుతో వస్తున్న ట్రాక్టర్‌కు పెనుప్రమాదం తప్పింది. గ్రామస్థుల కథనం మేరకు.. రాజాం-పార్వతీపురం ప్రధానరహదారిపై మంగళవారం అర్ధరాత్రి మూడుట్రాక్టర్లు కర్రల లోడుతో వస్తున్నాయి. ఈక్రమంలో ఒక ట్రాక్టరు అదుపు తప్పి వెనుక భాగంలో ట్రక్కు శీల జారిపోయింది. ఆ సమయంలో ఇంజన్ వేరుపడింది. కర్రల లోడుతో ఉన్న ట్రక్కు పెట్రోల్ బంకుకు ఆనుకునిఉన్న మందుల షాపుగోడను ఢీకొని ట్రక్కు నిలిచిపోవడంతో బంకు సిబ్బందితోపాటు సమీపంలో ఉన్న ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయంపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్యాస్ స్టౌవ్ దొంగతనం

చీపురుపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బస్టాండ్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కేంద్రం తలుపుల ఇనుప గడియను బద్దలు కొట్టి లోపల ఉన్న గ్యాస్ స్టౌవ్‌ను దొంగిలించారు. ఈ మేరకు అంగన్‌వాడీ కార్యకర్త కెల్ల శ్రీదేవి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 10న కూడా ఇదే కేంద్రంలో గ్యాస్ సిలిండర్ చోరీకి గురైనట్టు ఆమె తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఏడురోజుల జైలు

ఎస్.కోట రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):ఎస్.కోటలో ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతున్న శివరామరాజుపేటకు చెందిన కపిరెడ్డి అప్పారావుకు ఎస్.కోట న్యాయస్థానం స్పెషల్ జుడిషీయల్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ అప్పల నాయుడు ఏడురోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ నారాయణమూర్తి తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

రాజాంలో విద్యార్థిపై ఐదుగురు వ్యక్తుల దాడి

రాజాం రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థిపై బుధవారం ఐదుగురు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. రాజాం పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని రెల్లివీధికి చెందిన బండి ప్రేంకుమార్ ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. రెల్లివీధికి చెందిన కొందరు యువకులతో ప్రేంకుమార్‌కు కొంతకాలంగా వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈనేపథ్యంలో కళాశాలలో ఉన్న ప్రేంకుమార్ బయటకు వచ్చిన సమయంలో మాటువేసి ఉన్న సాయి, కార్తీక్, మహేష్, కిరణ్, బన్నీ సమీప మామిడితోటల్లోకి తీసుకువెళ్లి పిడిగుద్దులు గుద్ది, రాళ్లు, రాడ్డుతో తీవ్రంగా కొట్టి తోటలో విడిచిపెట్టారు. రక్తస్రావంతో ఉన్న ప్రేంకుమార్ చూసిన కొంతమంది ఆయన తల్లిదండ్రులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్న తండ్రి, కుటుంబసభ్యులు రాజాం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం తరలించారు. సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రవికిరణ్ ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు.

తల్లిదండ్రుల చెంతకు విద్యార్థి

రేగిడి, నవంబరు 12,(ఆంధ్రజ్యోతి): మండలంలోని మునకలవలస యూపీ పాఠశాలలో ఏడో తరగతి చదువుచున్న అదే గ్రామానికి చెందిన అల్లుబిల్లి చక్రధర్ విజయనగరంలో తల్లిదండ్రుల చెంతకు చేరాడు. ఎంఈవో వర్రప్రసాదరావు కథనం మేరకు.. చక్రధర్ తల్లిదండ్రులు విజయనగరం కూలిపనుల చేసి నివసిస్తున్నారు. చక్రధర్ తన తాత ఎండమూరి గొయ్యిశెట్టి సంరక్షణలో మునకలవలసలో చదువుతున్నాడు. ఈక్రమంలో ఈనెల పదోతేదీన పాఠశాలలో తెలుగు పరీక్ష రాస్తుండగా ఇన్విజిలేటర్‌కు పట్టుబడ్డాడు. దీంతో ఇన్విజిలేటర్ చక్రధర్‌ను మందలించి, మరుసటిరోజు తాతను స్కూల్‌కు తీసుకురావాలని సూచించాడు. ఈక్రమంలో చక్రధర్ తాతకు ఆ సమాచారం ఇవ్వకుండా స్కూల్‌కు వెళ్లాడు. దీంతో సదరు ఇన్విజిలేటర్ తాతను తీసుకురావాలని ఇంటికి పంపగా, చక్రధర్ ఇంటికి వెళ్లకుండా పరారయ్యాడు.ఈనేపథ్యంలో తాత, కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. ఈమేరకు గొయ్యిశెట్టి పోలీస్‌లకు ఫిర్యాదు చేయగా బుధవారం కేసు నమోదుచేశారు. తల్లిదండ్రులు దగ్గరి ఫోన్‌లేకపోవడంతో ఎటువంటి సమాచారం తెలియలేదు. పోలీసులు బుధవారం నిర్వహించిన దర్యాప్తులో చక్రధర్ తల్లిదండ్రులు వద్దకు వెళ్లినట్లు తేలడంతో తాత, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.దీంతో చక్రధర్‌ను ఎంఈవో సమక్షంలో పాఠశాలకు అప్పజెప్పారు.

వెల్‌నెస్ కేంద్రంలో మందుబాబుల వీరంగం

గజపతినగరం, నవంబరు12(ఆంధ్రజ్యోతి) మండలంలోని గంగచోళ్లపెంట వెల్‌నెస్ కేంద్రంలో రాత్రి సమయాల్లో మందుబాబులు వీరంగంచేశారు. దీంతో పరిసరాలు మద్యం సీసాలతో నిండిపోయాయి. స్థానికుల కథనం మేరకు..చీకటిపడిన తర్వాత గ్రామానికి చెందిన కొందరు వెల్‌నెస్ కేంద్రాన్ని మద్యం సేవించేందుకు వినియోగిస్తున్నారు. దీంతో ఉదయం కేంద్రానికి వచ్చే రోగులతో పాటు వైద్య సిబ్బంది ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో మందుబాబులు మంగళవారం రాత్రి కిటికీ అద్దాలు పగలగొట్టారు. గ్రామానికి అరకిలోమీటరు దూరంలో ఉండే ఈ కేంద్రంలో మందుబాబులకు అడ్డాగా మారింది. దీంతో ఉద్యోగులు విధులు నిర్వహించేందుకు భయాందోళనచెందుతున్నారు. బుధవారం ఉదయం విధులకు వచ్చిన ఎంఎల్‌హెచ్‌పీ ఎమీమా కిటికీ అద్దాలు పగిలి ఉండడంతోపాటు పరిసరాల్లో మందు సీసాలు ఉండడంతో మహిళాపోలీస్ దేవితోపాటు పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణకు సమాచారం అందజేశారు. రాత్రి సమయాల్లో పోలీసులు గస్తీ నిర్వహించి మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని వైద్య సిబ్బంది కోరుతున్నారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం

మెంటాడ,నవంబరు12 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి మెంటాడ మీదుగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను ఆండ్ర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.టిప్పర్‌లో బుధవారం ఇసుక తరలిపోతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆండ్ర ఎస్ఐ సీతారాం సిబ్బందిని అప్రమత్తంచేసి, మెంటాడ నేషనల్ హైవే రోడ్డు వద్ద వాహనాన్ని అడ్డగించి పట్టుకున్నారు. ధాన్యం తరలిస్తున్నట్లు డ్రైవర్ తప్పించుకునే ప్రయత్నం చేశాడు. పోలీసులు తనిఖీచేయగా ఇసుక అని నిర్ధారణకు వచ్చారు. డ్రైవర్‌ను విచారించగా అనంతగిరి మండలం వద్ద రోడ్డు నిర్మాణం జరుగుతోందని,అక్కడ రోడ్డుబాగోలేకపోడంతో విజయనగరం మీదుగా అల్లూరి సీతారామరాజు జిల్లా చిలకలగెడ్డ వద్దకు తరలిస్తున్నట్లు పేర్కొన్నాడు. రవాణాకు సంబంధించి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తరలించారు. వాహనాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నట్లు ఎస్ఐ సీతారాం చెప్పారు.

జాతీయ ఎస్టీ కమిషన్ విచారణ

ఎస్.కోటరూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):తమను గతంలో యాజమాన్యం మోసంచేయడంతో న్యాయం చేయాలని జిందాల్ నిర్వాసితులు లేఖ రాయడంతో ఢిల్లీలో జాతీయ ఎస్టీ కమిషన్ విచారణ నిర్వహించింది. ఢిల్లీలోని ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌కు గతంలో లేఖను అందించిన విషయం విదితమే.ఈమేరకు సెప్టెంబరు 19 హైదరాబాద్‌లో మొదటిదశ విచారణ జరిగింది. అయితే ఈవిచారణకు కలెక్టర్ హాజరుకాలేదు. మరోసారి బుధవారం ఢిల్లీలోని లోక్‌నాయక్ భవన్‌లో నిర్వహించిన విచారణకు జిందాల్ నిర్వాసితులతో పాటు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హాజరయ్యారు.

భూములు సాధించే వరకు పోరాడుతాం

ఎస్.కోట రూరల్, నవంబరు 12: (ఆంధ్రజ్యోతి): తమ భూములు సాధించేవరకు పోరాడుతామని జిందాల్ నిర్వాసితులు తెలిపారు. బుధవారం మండలంలోని బొడ్డవర వద్ద 151వరోజు నిరసన దీక్షను కొనసాగించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ కుటుంబాలు బాగుంటాయని ఎంతమంది వద్దన్నా భూములను జిందాల్ పరిశ్రమ కోసం 18 ఏళ్ల కిందట ఇచ్చామని తెలిపారు. నేటికి కంపెనీ నిర్మాణం చేయకపోగా తమ భూములను ఎంఎస్ఎంఈ పార్కులకు ఇవ్వడం సమంజసం కాదని జిందాల్ నిర్వాసితులు వాపోయారు.

అప్రెంటీస్ మేళాలో 110 మంది ఎంపిక

రాజాం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజాం ప్రభుత్వ ఐటీఐలో బుధవారం నిర్వహించిన అప్రెంటీస్‌మేళాలో 110 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు తెలిపారు. సంకిలి ఇఐడీ ప్యారీ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో ఫిట్టర్, ఎలక్ట్రిషియన్, ఎలక్ట్రానిక్, మెకానిక్, ఇనుస్ట్రుమెంట్ మెకానిక్, వెల్డర్ ట్రేడుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు మేళా నిర్వహించారు.

సచివాలయాలకు.. ఎప్పుడొస్తారో?

(5వ పేజీ తరువాయి)

సోమవారం ఉదయం 10:20 గంటలకు అగ్రికల్చర్ అసిస్టెంట్ ఈ.శ్రీనివాసరావు ఒక్కరే ఉన్నారు. ఆ తరువాత దండిగాం రోడ్డు వద్ద ఏఎన్ఎం కనిపించారు. ఇక్కడ మొత్తంగా 12మంది విధులు నిర్వహించాల్సి ఉండగా.. ఒక్కరిద్దరే హాజరయ్యారు. దీనిపై ఎంపీడీవో పార్వతిని వివరణ కోరగా.. సచివాలయ సిబ్బంది అంతా వివిధ రకాల సర్వేల్లో క్షేత్రస్థాయిలో ఉన్నారన్నారు. వీఆర్వో, సర్వేయర్, ఏఎన్ఎంలు వారి కార్యాలయల వద్ద ఆన్‌లైన్‌లో హాజరు వేస్తారని, సచివాలయాలకు రారని, మరికొంతమంది సర్వేల్లో ఉన్నారని సచివాలయ అడ్మిన్, కరాసువలస పంచాయతీ కార్యదర్శి రమేష్ ఫోన్ ద్వారా తెలిపారు. ఇక సాలూరు పట్టణంలో 10వ సచివాలయాన్ని (20,21,22 వార్డులు) విజిట్ చేయగా పది మందికి ఆరుగురు సిబ్బందే కనిపించారు.దీనిపై ఇన్‌చార్జి అడ్మిన్ సాయిచంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. 'అడ్మిన్, వీఆర్వో, ఎనర్జీ సెక్రటరీ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. ఏఎన్ఎం ఉన్నప్పటికీ సచివాలయ కంట్రోల్‌లో లేరు.' అని తెలిపారు.

● పార్వతీపురం రూరల్: వెంకంపేట సచివాలయంలో గ్రామ సర్వేయర్ సెలవు పెట్టినట్టు రిజిస్టర్‌లో సిఎల్ మార్క్ చేసి ఉంది. కానీ లేఖ మా త్రం లేదు. డిజిటల్ అసిస్టెంట్ కె.సురేష్‌కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ వి.శ్రీరాములునాయుడు, ఏఎన్ఎం విధుల్లో ఉన్నారు. వెటర్నరీ అసిస్టెంట్ ఎస్.మౌనిక సచివాలయంలో సంతకం చేసిన అనంతరం మందుల కోసమని పశువైద్యశాలకు వెళ్లిపోయారు. అడ్డాపుశీల సచివాలయంలో కార్యదర్శి గణపతి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సంతోష్, యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్ వెంకట నాయుడు, ఏఎన్ఎం కాత్యాయిని, మహిళా పోలీస్ సుజాత మాత్రమే ఉన్నారు. డిజిటల్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు కనిపించ లేదు. గ్రామ సర్వేయర్ హిమబిందు సుమారు నెల రోజులు సెలవు పెట్టినట్లు తెలిసింది. రిజిస్టర్‌లో పేరు కూడా లేదు. దీనిపై కార్యదర్శి గణపతిరావు ను వివరణ కోరగా.. సుమారు నెల రోజుల పాటు ఆమె విధులకు హాజరుకాకపోవడం వాస్తవమేనని తెలిపారు.

● భామిని: భామిని సచివాలయాన్ని సోమవారం ఉదయం పది గంటలకు పరిశీలించగా.. పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీస్ తప్ప ఎవరూ లేరు. కార్యదర్శి నాగేశ్వరరావును వివరణ కోరగా.. 'డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు డెప్యుటేషన్లపై వెళ్లారు.' అని తెలిపారు. లివిరి సచివాలయానికి ఉదయం 10.30 గంటలకు వెళ్లగా డిజిటల్ అసిస్టెంట్ మమత ఒక్కరే ఉన్నారు. మిగతా వారి గురించి అడగ్గా.. ఫీల్డ్‌లోకి వెళ్లిపోయారని ఆమె చెప్పారు.

● గరుగుబిల్లి: గొట్టివలస సచివాలయంలో సోమవారం ఉదయం 10.30 నుంచి 11.15 గంటల సమయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, వెటర్నరీ సిబ్బంది కనిపించారు. వ్యవసాయశాఖ సిబ్బంది మండల కేంద్రంలోని కార్యాలయానికి, వీఆర్వో మరుపెంటలో రెవెన్యూ సమస్య పరిశీలనకు వెళ్లారని, డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీస్‌లు కొంతమేర ఆలస్యంగా విధులకు హాజరయ్యారని సచివాలయ కార్యదర్శి పి.శిరీష తెలిపారు. గరుగుబిల్లి సచివాలయంలో కార్యదర్శితో పాటు డిజిటల్ అసిస్టెంట్, మత్స్యశాఖ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లు హాజరయ్యారు. మహిళా పోలీస్, ఏఎన్ఎం, సర్వేయర్, వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లారని కార్యదర్శి కీర్తి వెల్లడించారు.

ఎన్నాళ్లీ డోలీ మోత?

(5వ పేజీ తరువాయి)

దూరంలో ఉన్న రెబ్బ కొండ శిఖర గ్రామానికి రహదారి సౌకర్యం లేదు. నాగావళి నది దాటి గ్రామానికి చేరుకోవాల్సిన పరిస్థితి . దీంతో గ్రామస్థులే సొంతంగా నిధులు ఏర్పాటు చేసుకుని నాటు పడవను ఏర్పాటు చేసుకున్నారు. అయితే రోడ్డు లేని కారణంగా తరచూ డోలీ మోతలు తప్పడం లేదని, సకాలంలో వైద్య సేవలు పొందలేక పోతున్నామని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

సీహెచ్‌సీ భవన నిర్మాణం పరిశీలన

గుమ్మలక్ష్మీపురం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): స్థానిక భద్రగిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అదనపు భవన నిర్మాణాలను ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ భవన నిర్మాణం పూర్తయితే రోగులకు సౌకర్యాలు మెరుగుపడతాయన్నారు. ప్రస్తుతం ఉన్న పాత భవనం చిన్నది కావడంతో అదనపు బెడ్లను వేయలేకపోతున్నామన్నారు. ఆమెతో పాటు జిల్లా సమన్వయకర్త నాగభూషణం ఉన్నారు.

ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు

గరుగుబిల్లి, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఎం.శ్రావణ్‌కుమార్ నాయుడు తెలిపారు. బుధవారం ఖడ్గవలస ప్రాంతంలో వరి పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. నిర్దేశిత ప్రాంతంలో చేపట్టిన పంట కోత ప్ర యోగంలో 11.25 కిలోల దిగుబడి వచ్చిందన్నారు. ఎకరాకు 18.22 క్వింటాళ్ల మేర దిగుబడులు వస్తాయని అంచనా వేశారు. కార్యక్రమం లో వ్యవసాయాధికారి టి.జ్యోత్స్న ఎన్ఎఫ్ఏలు తిరుపతిరావు, జి.అన్నపూర్ణ, శిక్షకులు బి.శ్రీరామతో పాటు పలువురు రైతులు, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఆయుర్వేదం, హోమియోతో ఉపశమనం

సీతానగరం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): శీతాకాలంలో సంభవించే పలు రుగ్మతలకు ఆయుర్వేదం, హోమియో వైద్యంతో మెరుగైన ఫలితాలు ఉంటాయని ఆయూష్, హోమియో వైద్యాధికారులు డాక్టర్ టి.హేమాక్షి, డాక్టర్ బి.సుశీల అన్నారు. బుధవారం చెల్లంనాయుడు వలసలో వైద్య శిబిరం నిర్వహించారు. సందర్భంగా 90 మందికి వైద్య సేవలు అందించారు. అనంతరం చలి కాలంలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పారినాయుడు, ఆయూష్ సిబ్బంది వై.పద్మ పాల్గొన్నారు.

రేపు న్యాయ అవగాహన సదస్సు

బెలగాం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా ఈ నెల 14న నర్సిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సును నిర్వహించనున్నామని రెండో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాకమిటీ అధ్యక్షుడు ఎస్.దామోదరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం మొదలవుతుందని పేర్కొన్నారు.

మండల కమిటీల ఏర్పాటుపై సమావేశం

పాలకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలోని మండల కమిటీల ఏర్పాటుపై నిర్వహించిన పట్టణంలో బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో అరకు పార్లమెంట్ యువత అధ్యక్షుడు వారాడ సుమంత్‌నాయుడు, మాజీ పట్టణ అధ్యక్షుడు గుమ్మడి సింహాద్రి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు మజ్జి జయశంకర్, ఏఎంసీ చైర్మన్ త్రినాథరావు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయమని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. బుధవారం లుంబేసు పంచాయతీ లప్పటి గ్రామంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం ద్వారా నిర్మించిన ఇంటిని జగదీశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సొంతిల్లు ఉండాలని ఎన్టీఆర్ ఆశయాన్ని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇళ్ల నిర్మాణం జాప్యం లేకుండా 3 లక్షల ఇళ్లను పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలకు ప్రభుత్వం నేడు శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ, మండల ప్రత్యేక అధికారి టి.కనకదుర్గ, మండల పార్టీ అధ్యక్షుడు అడ్డాకుల నరేష్, బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిమ్మక సింహాచలం, మాజీ ఎంపీపీ తాడంగి లక్ష్మణరావు, ఎంపీడీవో ఐ.వి.లక్ష్మి, హౌసింగ్ డీఈ ఎన్.వెంకటరావు, ఏఈ ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

●పార్వతీపురం టౌన్: గత వైసీపీ ప్రభుత్వంలో పేదలకు సెంటు స్థలాన్ని కేటాయించిందని, అప్పటి సీఎం జగన్‌మాత్రం ప్యాలస్‌ల మీద ప్యాలస్‌లు కట్టుకుని దర్జాగా జీవనం గడిపారని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర విమర్శించారు. బుధవారం పట్టణంలోని జగన్నాథపురంలో నూతన గృహప్రవేశాలు, గృహ నిర్మాణాలకు సంబంధించిన భూమి పూజ కార్యక్రమాలకు కలెక్టర్ ప్రభాకర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పేదలకు 346 మంది పేదలకు ఇళ్లు మంజూరు చేశామన్నారు. టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత నందమూరి తారక రామారావు ఆశయాల కోసం సీఎం చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. అనంతరం ఇళ్లు నిర్మించుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలు, మిగతా లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వైశాలి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



పొజిషన్ సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర, కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ జగదీశ్వరి

●పాలకొండ: మండలంలోని నవగాంలో బుధవారం ప్రధానమంత్రి గ్రామీణ్, ప్రధానమంత్రి ఉడా స్కీం కింద మంజూరైన ఇళ్లల్లో బుధవారం గృహ ప్రవేశాలు జరిగాయి. ఈ సందర్భంగా హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.రవి మాట్లాడుతూ ఈ గ్రామంలో 50 గృహాలు ఈ స్కీమ్‌లలో మంజూరు కాగా ఏడు గృహాలకు వివిధ దశలో ఉండగా 43 ఇళ్లు నిర్మాణాలు పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన గృహా నిర్మాణాలు చేపట్టాలన్నారు. కార్య క్రమంలో ఏఈ సుధారాణి పాల్గొన్నారు.

గ్రామీణుల సంపూర్ణ ఆరోగ్యానికి చర్యలు

గరుగుబిల్లి, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని నాబార్డ్ డీడీఎం ఎస్.దినేష్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం తోటపల్లి జట్టు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జీవ కార్యక్రమం శిక్షణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు రసాయన ఎరువులతో పండించిన పంటలతో కాకుండా సేంద్రియ విధానాలతో పండించిన పంటలతోనే పూర్తిస్థాయిలో పోషకాలు లభ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో జట్టు సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ డి.పారినాయుడు మాట్లాడుతూ మానవ శరీరానికి ప్రధానంగా మూడు లక్షణాలు అందించే ఆహారం కావాలన్నారు. ఇందులో శక్తినిచ్చేవి, పెరుగుదలకు సహకరించేవి, రోగ నిరోధకాలను కల్పించేవి ఉండాలన్నారు. కార్యక్రమంలో మధ్యప్రదేశ్‌కు చెందిన రిసోర్స్‌పర్సన్ భావన నగీర్ వెయ్యి రోజులు పథకంపై అవగాహన కల్పించాలన్నారు. శిక్షణలో రచయిత రౌతు వాసుదేవరావు, సిలబస్ కన్సల్టెంట్ టి.శివాజీ పలు అంశాలపై అవగాహన కల్పించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణకు 55 మందికి పైగా ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు, ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్, ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ప్రబోధ్, రైతు సాధికార సంస్థ ప్రతినిధులు ప్రసన్న, రామలత, ఉమామహేశ్వరి, హరిత, ఎం.నూకంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



పోషకాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఘనంగా అయ్యప్ప తిరువీధి

పాలకొండ, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం రాత్రి అయ్యప్పస్వామి తిరువీధిని ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి మాలాధారణలో భాగంగా సెనగల దుర్గారావు గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహంతో తిరువీధిని చేపట్టారు. ఆంజనేయ స్వామి సన్నిధానం నుంచి కోటదుర్గమ్మ గుడి వరకు అయ్యప్పస్వామి శరణఘోషతో తిరువీధి సాగింది.



తిరువీధి నిర్వహిస్తున్న అయ్యప్పస్వాములు

మహిళలకు యాప్‌పై శిక్షణ

వీరఘట్టం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో బుధవారం స్వయంశక్తి మహిళలకు ఈ-నారి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీపీఎం సీహెచ్.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ మహిళా సంఘం సభ్యులు అప్పు, పొదుపు వివరాలు ఆన్‌లైన్‌లోనే తెలుసుకోవచ్చునన్నారు. మన డబ్బులు, మన లెక్కలు యాప్ మహిళా సంఘాల సభ్యులకు ఎంతో దోహదపడుతుందన్నారు. శిక్షణ పొందిన సభ్యులు ఆయా గ్రామాల్లోని మిగిలిన సభ్యులకు వివరిస్తారన్నారు. కార్య క్రమంలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె.లలితకుమారి, ఏపీఎం రాము పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఎం రామ్మోహన్‌రావు

పక్కాగా సంఘాల ఆర్థిక లావాదేవీలు

గరుగుబిల్లి, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): రుణాల చెల్లింపుల్లో అవకతవకలకు అడ్డుకట్ట వేయడానికి మొబైల్ బుక్ కీపింగ్ యాప్ 2.0 (మన డబ్బులు-మన లెక్కలు) అందుబాటులోకి వచ్చిందని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మన డబ్బులు-మన లెక్కలు కార్యక్రమానికి సంబంధించి బుధవారం వెలుగు సీసీలు, గ్రామ పంచాయతీలకు సంబంధించిన వీవోఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ రామారావు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు సంబంధించిన కార్యకలాపాలు ఇకపై పక్కాగా ఉండనున్నాయన్నారు. కార్యక్రమం లో డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు, బ్యాంకు లింకేజీ ఏపీఎం బి.బంగారమ్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు టి.చంద్రకళ, వెలుగు ఏపీఎం పి.అప్పల నాయుడు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో వెలుగులు

కొమరాడ, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): గిరిశిఖర ప్రాంతాల్లో గిరిజనుల జీవన నాణ్యతను మెరుగుపరచడమే పీఎం జుగా లక్ష్యమని విద్యుత్‌శాఖ ఇంజనీర్ జి.వెంకటరమణ అన్నారు. పీఎం జుగా పథకంలో భాగంగా వనకాబడి పరిధిలోని కొండ ప్రాంతంలో నివసిస్తున్న కొన్ని కుటుంబాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించారు. వారిళ్లకు విద్యుత్ మీటర్లు బిగించారు. ఇప్పటివరకు వనకాబడి, కంకేసు, కుంతేసు తదితర గ్రామాల్లో 12 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 399 సర్వీసులు కల్పించాన్నారు. సంకేసులోనే 80 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశామన్నారు. గిరిశిఖర ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం లేని ఏ ఒక్క కుటుంబం ఉన్నా పీఎం జుగా పథకంలో చేర్చి ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని ఇంజనీర్ జి.వెంకటరమణ తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్యాంప్ కార్యాలయంలో బుధవారం సీఎం సహాయనిధి చెక్కులను ప్రభుత్వ విప్ జగదీశ్వరి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కురపాం మండలం గరుగుబిల్లికి చెందిన ఐదుగురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కురపాం మండల కన్వీనర్ కొండయ్య, గుమ్మలక్ష్మీపురం మండల కన్వీనర్ అడ్డాకుల నరేష్, కోలా రంజిత్, తోటపల్లి దేవస్థానం చైర్మన్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

●పార్వతీపురం రూరల్: సీతానగరం, పార్వతీ పురం, బలిజిపేట మండలాల పరిధిలో ఉన్న గుచ్చిమ్మి, గాదిలవలస, అంపావల్లి గ్రామాలకు చెందిన పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను బుధవారం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పంపిణీ చేశారు. గుచ్చిమి గ్రామానికి చెందిన సావిత్రమ్మ కుటుంబ సభ్యులకు రూ.37205, గాజుల వలనకు చెందిన భోగి సాంబమూర్తి కుటుంబానికి రూ.67832, బలిజిపేట మండలం అంపావలి గ్రామానికి చెందిన శెట్టి గాయత్రీ కుటుంబ సభ్యులకు రూ.30 వేలు, అదే గ్రామానికి చెందిన ఉమామహేష్ కుటుంబాలకు రూ.42,609 లను ఆయన అందజేశారు.

వైసీపీ నిరసన ర్యాలీలు

కురుపాం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేసి పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయవద్దని మాజీ ఉప ముఖ్యమంతి పుష్ప శ్రీవాణి అన్నారు. బుధవారం వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడాన్ని నిరసనగా కురుపాంలో స్థానిక పెట్రోల్ బంక్ నుంచి రావాడ రోడ్డు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. రావాడ రోడ్డు జంక్షన్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ జయకు వినతిపత్రం అందజేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు కార్యక్రమంలో పాల్గొన్నారు.

●పాలకొండ: వైద్య కళాశాలల ప్రైవేటీకరణను కూటమి సర్కార్ ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని కోటదుర్గమ్మ జంక్షన్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు వైసీపీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కళావతి మాట్లాడుతూ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేస్తే వైసీపీ ఊరుకోదన్నారు.

●సాలూరు: వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పట్టణంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నివాసం నుంచి బోసు బొమ్మ కూడలి వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ నీలకంఠరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ వైసీపీ అధ్యక్షుడు వంగపండ అప్పలనాయుడు, నాయకులు పువ్వల శ్రీనివాసరావు, గిరి, రఘు, మావుడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

●బెలగాం: వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయవద్దని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైఎస్ఆర్ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌లోని అధికారులకు వినతిపత్రం ఇచ్చేందుకు లోపలకు వెళ్లడానికి మాజీ ఎమ్మెల్యే ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. కొంతమందిని అనుమతించడంతో డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు.

విజేతలకు అభినందనలు

వీరఘట్టం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి):వీరఘట్టం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీల్లో గంగంపేట ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. నిమ్మక విశాల్ వకృత్వ పోటీలో ప్రథమ స్థానం, నిమ్మక వంశీ వ్యాసరచన పోటీలో ప్రథమ స్థానం సాధించడంతో ప్రధానోపాధ్యాయులు భాస్కరరావు, వైకైలాసరావు, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్ కోరంగి రాజేశ్వరి అభినందించారు.

● స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు డ్యాన్స్, పాటలు, స్కిట్ పోటీలను నిర్వహించారు. చిల్డ్రన్స్‌డే సందర్భంగా విద్యార్థులకు పోటీలు జరిగాయి. విజేతలకు ఎంఈవో ఆనందరావు అభినందనలు తెలిపారు. ఇందులో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులు గురువారం జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకు హాజరవు తారన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అకౌంటింగ్ డే

పాలకొండ, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ అకౌంటింగ్ డేను ఘనంగా నిర్వహించారు. కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు మాట్లాడుతూ అకౌంటింగ్ డేను మొదటిసారిగా 1972 నవంబరు 10న కాలిఫోర్నియా సొసైటీ ఆఫ్ సీపీఏ శాన్‌డియాగో అధ్యాయం అధికారికంగా జరుపుకుందన్నారు. తర్వాత ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిందన్నారు. అనంతరం వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.రాజ్యలక్ష్మి మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో ఫుడ్ స్టాల్స్, గేమ్స్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయమణి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.రాజు, అధ్యాపకులు రాఘవేంద్రనాయుడు, ఎం.శాంతి, కూన శ్రీనివాసరావు, ఆమంచి శ్రీనివాసరావు, ఎస్.జగన్మోహన్‌రావు, టి.పార్వతీశ్వరరావు, వి.పాల్గుణరావు పాల్గొన్నారు.

సందడిగా కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం

మక్కువ రూరల్/సాలూరు, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంబర లో బుధవారం టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం సందడిగా నిర్వహించారు. బుధవారం శంబరలో నిర్వహించిన నియోజకవర్గం టీడీపీ ప్రత్యేక సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ, మండల, గ్రామ కమిటీలు, క్లస్టర్లు, యూనిట్ ఇన్‌చార్జ్‌ల ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు సాలూరు పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, పాచిపెంట అధ్యక్షుడు గూడెపు యుగంధర్, మక్కువ అధ్యక్షుడు గుళ్ల వేణుగోపాలనాయుడు, మెంటాడ అధ్యక్షుడు చలుమూరు వెంకటరావు, సాలూరు అధ్యక్షుడు ఆముదాల పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కమిటీ ప్రతినిధులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న మంత్రి సంధ్యారాణి

హద్దులు నిర్ణయించిన రెవెన్యూ శాఖ

పార్వతీపురం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని చెరువులతో పాటు వరహాల గెడ్డ ఆక్రమణలకు గురవుతున్న పరిస్థితి ఉంది. దీనిపై ఆంధ్రజ్యోతి ఈ నెల 7న 'చెరువులు వదలట్లే' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి రెవెన్యూ, ఇరిగేషన్, పురపాలకశాఖ అధికారులు స్పందించారు. బుధవారం ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి బోర్డులు ఏర్పాటు చేశారు. గతంలో కూడా బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ ఆక్రమణకు అనేక మంది ప్రయత్నించారు. ఆక్రమణలకు గురికాకుండా హద్దులను నిర్ణయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఇరిగేషన్ పురపాలక సంఘ అధికారులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల రాణింపు

సీతంపేట రూరల్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో సీతంపేట ఐటీడీఏ పాఠశాలకు చెందిన గిరిజన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బాలికల విభాగంలో బుధవారం నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నారు. అలాగే ఆల్ రౌండ్ చాంపియన్‌షిప్ కూడా దక్కించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్‌స్వప్నిల్ జగన్నాథ్, డీడీ అన్నాదొర అభినందించారు. కార్యక్రమంలోస్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకబ్ దయానంద్, పీఈటీలు ఉన్నారు.



చాంపియన్‌గా నిలిచిన విద్యార్థినులు

పెద్దకర్జలో అగ్ని ప్రమాదం

గుమ్మలక్ష్మీపురం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): పెదకర్జలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో నీచుక పుష్పాంజలికి చెందిన రేకిల్లు దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. ఇంటిలో రూ.50 వేలు నగదు, వంట సామగ్రి, దుస్తులు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఆర్ఐ బి.శివరామకృష్ణ 25 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, చీరలు, దుప్పట్లు అందజేశారు.

విద్యుదాఘాతంతో లారీ టైర్లు దగ్ధం

బెలగాం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చైతన్య పాఠశాల సమీపంలో లారీపైన ఎక్సకవేటర్‌ను తీసుకెళుతుండగా బుధవారం విద్యుత్ తీగలు దాన్ని తాకాయి. దీంతో మంటలు వ్యాపించాయి. లారీ టైర్లు స్వల్పంగా దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.

బీఎస్ఎన్ఎల్ టవర్లు మంజూరు

గుమ్మలక్ష్మీపురం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): దేరివాడ, డొంగర కిక్కువ, కొండవారి, గోడవస్తాడ గిరిజన గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు కానున్నాయని తహసీల్దార్ శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కుశ జలపాతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయండి



కుశ జలపాతం, శివలింగానికి పూజలు చేస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వనకాబడి పంచాయతీ కుశ జలపాతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని గిరిజనులు కోరారు. గతంలో విజయనగరం కలెక్టర్ సూర్యకుమారి కుశ జలపాతాన్ని పరిశీలించారు. పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రూ.30 లక్షలు మంజూరు చేశారు. అయితే ఆ తర్వాత విజయనగరం జిల్లా నుంచి మన్యం జిల్లా విడిపోవడం పనులు జరగలేదు. ప్రస్తుతం మన్యం కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి గిరిజన ప్రాంతంలో పర్యాటక అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో కుశ జలపాతాన్ని కలెక్టర్ సందర్శించాలని గిరిజనులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో పురాతనమైన శివలింగం ఉందని, జలపాతానికి చేరువలో ఆలయం కడితే బాగుంటుందని వారంటున్నారు.